సాక్షి
ఒడిశా

శుక్రవారం । 18 । జూలై । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,49,875లు, బంగారం 1గ్రాముల 100 మిల్లీగ్రాములు, వెండి 64 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

నలుగురు వైద్యులు సస్పెన్షన్



గజపతి జిల్లాలో నలుగురు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రం సామాజిక ఆరోగ్య అధికారులను జిల్లా ముఖ్య వైద్యాధికారి సస్పెండ్ చేశారు.

- 8లో



పరిశుభ్ర నగరంగా భువనేశ్వర్

భువనేశ్వర్ జాతీయ స్థాయిలో 10 పరిశుభ్రమైన నగరాల్లో ఒకటిగా నిలిచింది. ప్రతిష్ఠాత్మకమైన స్వచ్ఛ సర్వేక్షణ్ 2024లో నగరం 9వ ర్యాంక్‌ను సాధించింది.

- 8లో

న్యూస్‌రీల్

కుప్పకూలిన బీజేడీ నేత



చికిత్స పొందుతున్న ప్రమోద్‌కుమార్ పాఢీ

కొరాపుట్: రాష్ట్ర మాజీ లిఫ్ట్ ఇరిగేషన్ కార్యదర్శి, సీనియర్ బీజేడీ నాయకుడు ప్రమోద్ కుమార్ పాఢీ అకస్మాత్తుగా ఇంటిలో కుప్పకూలిపోయారు. వెంటనే నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బీపీ పడిపోవడంతో కలహండి జిల్లా కేంద్రం భవాని పట్నలోని ప్రభుత్వ వైద్య కళాశాలకి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో విశాఖపట్నంలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్లు సమాచారం.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య



హిమాంశు హోత (ఫైల్)

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్న గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (జీఐఈటీ) విశ్వవిద్యాలయంలో చదువుతున్న హిమాంశు హోత(19) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు బయోటెక్నిక్ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సమాచారం తెలుసుకున్న గుణుపూర్ ఆదర్శ పోలీసులు సంఘటన స్థలానా సైంటిఫిక్ బృందంతో చేరుకుని దర్యాప్తు చేపట్టారు. విశ్వవిద్యాలయంలోని ఎస్‌సీ-7 బ్లాక్‌లో రెండో నంబర్ వసతి గృహంలో ఉంటున్నాడు. ఉదయం ఎప్పటిలాగే తోటి విద్యార్థులు వెళ్లి తలుపులు తట్టగా ఎటువంటి సమాధానం లేకపోవడంతో అనుమానించి వెంటనే హాస్టల్ వార్డెన్‌కు తెలియజేశారు. అక్కడకు చేరుకున్న వార్డెన్ కిటికీ నుండి చూడగా హోత మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో యజమాన్యానికి తెలియజేశారు. మృతుడు బాలేశ్వర్ జిల్లాలోని సోర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా సమాచారం. తరచూ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది.

అండరాకంచ్ ఐఐసీపై ఫిర్యాదు



ఎస్పీ కార్యాలయ అధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి మైకంచ్ పంచాయతీ పరిధిలోని అండరాకంచ్ పోలీస్ స్టేషన్‌లో ఐఐసీగా విధులు నిర్వహిస్తున్న బిద్యులత నాయక్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీన కార్యాలయంలో అతనిపై ఫిర్యాదు చేశారు. ఏదైనా కేసు విషయమై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే వారిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. మైకంచ్, కొడిపారి పంచాయతీల సర్పంచ్‌లు, సమితి సభ్యులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు. ఈ నెల 11వ తేదీన మైకంచ్ సర్పంచ్ మస్తారామ్ మాఝి ఒక పని విషయమై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా అతనిపై ఐఐసీ నాయక్ దురుసుగా ప్రవర్తించారని వివరించారు. ప్రజా సేవ కోసం, శాంతి భద్రతలను కాపాడేందుకు ఉన్న పోలీస్ స్టేషన్లలో ప్రజలకే రక్షణ కరువైతే ఇంకా సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు చేపట్టి తగిన న్యాయం చేయమని కోరారు.

హత్యకేసు నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి దొరాగుడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఒక హత్య కేసుతో సంబంధం ఉన్న నిందితునికి జిల్లా అదనపు జడ్జి అల్పన స్వయి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు పది వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమాన చెల్లించని పక్షంలో మరో ఏడాది శిక్షను అనుభవించాలని పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే.. 2021 డిసెంబర్ 24వ తేదీన కాసీపూర్ సమితిలోని గులుముజోల గ్రామంలో ఉన్న ప్రాథమిక విద్యాలయంలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న సరస్వతి నాథ్, ఆమె భర్త ముకుందనాథ్ శర్మలను గుర్తు తెలియని వ్యక్తి తురాయిఘాటి ప్రాథమిక విద్యాలయం సమీపంలో హత్య చేశారు. ఈ కేసుకు సంబంధించి దొరగుడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు గులా అనే వ్యక్తిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఈ కేసును బుధవారం విచారించిన జిల్లా అదనపు జడ్జి స్వయి నిందితునికి యావజ్జీవ శిక్షను విధించినట్లు న్యాయవాది రామప్రసాద్‌పాత్రో గురువారం తెలిపారు.



భువనేశ్వర్: ఒడిశా బంద్ నినాదంతో ఆందోళన చేస్తున్న నాయకులు



రాయగడ: బోసిపోయిన మెయిన్ మార్కెట్

బంద్ సంపూర్ణం

బాలేశ్వర్ జిల్లా ఫకీర్ మోహన్ సేనాపతి కళాశాల విద్యార్థిని సౌమ్యశ్రీ బిసి ఆత్మాహుతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ పీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు చేపట్టిన 12 గంటల బంద్ ప్రశాంతంగా ముగిసింది. విద్యా సంస్థలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు మూతపడ్డాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ బీజేపీ ఏడాది పాలనలో మహిళలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలు నిరంకుశ పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. విద్యార్థి మృతికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, బాలేశ్వర్ ఎంపీ, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్ తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బంద్‌లో కాంగ్రెస్ నాయకులతో పాటు వామపక్ష నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



రాయగడ: గుణుపూర్‌లో ఎమ్మెల్యే సత్యజిత్ గొమాంగో నేతృత్వంలో ఆందోళన



జయపురం: బంద్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, బాహిణీపతి, కాంగ్రెస్ నేతలు



జయపురం:మూతపడిన దుకాణాలు



పర్లాకిమిడి: హైస్కూల్ జంక్షన్ వద్ద మూడో బెటాలియన్ పహారా



పర్లాకిమిడి: బంద్‌తో మూతబడిన వ్యాపార కూడలి



పర్లాకిమిడి: పర్లాకిమిడి కాలేజ్ జంక్షన్ వద్ద సీఎం, విద్యాశాఖ మంత్రుల దిష్టిబొమ్మలను తగులబెడుతున్న కాంగ్రెస్, వామపక్షాల నాయకులు



భువనేశ్వర్: ఆందోళనకారులు, పోలీసులు బాహాబాహి



భువనేశ్వర్: బస్సులను అడ్డుకున్న ఆందోళనకారులు



రాయగడ: సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో గుణుపూర్‌లో బంద్



కొరాపుట్: నబరంగ్‌పూర్ కొవ్వొత్తుల ర్యాలీ



కొరాపుట్: నారాయణపట్నలో ఆందోళన



కోరాపుట్: లక్ష్మీపూర్‌లో ఎమ్మెల్యే పవిత్ర శాంత ఆందోళన



మల్కన్‌గిరి: బస్టాండ్ వద్ద కాంగ్రెస్ నేతల ర్యాలీ



మల్కన్‌గిరి: నినాదాలు చేస్తున్న నాయకులు

కలప దుంగలు తరలిస్తున్న ట్రక్కు పట్టివేత

- డ్రైవర్ అరెస్టు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ అటవీ సిబ్బంది కలప దుంగలను అక్రమంగా తరలిస్తున్న ట్రక్కును పట్టుకున్నారు. ట్రక్కు డ్రైవర్ టికేశ్వర కుమార్ సాహును అరెస్టు చేసినట్లు అటవీ విభాగ అధికారి సందీప్ కుమార్ పాణిగ్రాహి గురువారం వెల్లడించారు. ట్రక్కులో తీసుకెళ్తున్న 16 విలువైన కలప దుంగలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. బొయిపరిగుడ సమితి దసమంతపూర్ అటవీ ప్రాంతం నుంచి ఒక ట్రక్కులో కలప అక్రమంగా తీసుకుపోతున్న సమాచారం విశ్వసనీయ వర్గాల ద్వారా అందిందన్నారు. వెంటనే దసమంతపూర్ ఫారెస్టర్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని పంపించి ట్రక్కును అడ్డుకొని కలప సీజ్ చేసినట్లు వివరించారు. కలప ఉన్న ట్రక్కును అటవీ విభాగ కార్యాలయానికి తీసుకు వచ్చామన్నారు. డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



కలపతో సీజ్ చేసిన ట్రక్కు

గూడ్స్ రైలు ఢీకొని కార్మికుని మృతి



దేవర్షి మృతదేహం

- మరో ఇద్దరికి గాయాలు

రాయగడ: గూడ్స్ రైలు ఢీకొని కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన స్థానిక రైల్వే స్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫాంపై గురువారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో మృతి చెందిన వ్యక్తి సుందర్‌ఘడ్ జిల్లా దురుధేని పోలీస్ స్టేషన్ పరిధి అనల్‌జొర గ్రామానికి చెందిన చైతు కిసాన్ కుమారు దేవర్షి కిసాన్ (20)గా గుర్తించారు. గాయపడిన వారిలో సుందర్‌గఢ్‌కు చెందిన బబుల సాహ, రాయగడకు చెందిన సుశాంత్ దాస్‌లు ఉన్నారు. సంఘటన జరిగిన అనంతరం రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గురువారం ఉదయం రైల్వే ట్రాక్ మెయింటెనెన్స్ పనులకు సంబంధించి దేవర్షి, బబుల, సుశాంత్‌లు పుష్ ట్రాలీలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నాలుగో ప్లాట్‌ఫాం వద్ద గల నాలుగు–అయిదు ట్రాక్ లైన్ మధ్య ట్రాలీని నిలిపారు. అదే సమయంలో గూడ్స్ ట్రైన్ ట్రాలీని ఢీకొంది. దీంతో ట్రాలీ వద్దగల దేవర్షి రైలు కింద పడి నుజ్జునుజ్జవ్వగా సుశాంత్, బబులలు గాయాలతో బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న రైల్వే అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతి చెందిన దేవర్షి కుటుంబానికి రైల్వే శాఖ తరఫున తగిన నష్టపరిహారం చెల్లిస్తారన్నారు. దేవర్షి, బబులలు ఓ రైల్వే కాంట్రాక్టరు వద్ద కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్నట్లు సమాచారం.



ప్రమాదంలో నుజ్జయిన ట్రాలీ



గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బబుల సాహ



గాయాలతో సుశాంత్ దాస్

బాలికల విద్యాలయం తనిఖీ



పాఠాలు బోధిస్తున్న ఎమ్మెల్యే పవిత్ర శాంత

కొరాపుట్: కొరాపుట్ జిల్లా బందుగాం సమితి నీలవడిలోని ప్రభుత్వ బాలికల విద్యాలయాన్ని కాంగ్రెస్ పార్టీకి చెందిన లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత గురువారం ఆకస్మికంగా తణిఖీ చేశారు. మహిళలు, బాలికలపై లైంగిక వేధింపులు పెరుగుతున్న నేపథ్యంలో ఎంఎల్ఎ ఆకస్మిక సందర్శన ప్రాధాన్యతను సంతరించుకుంది. విద్యాలయం పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రత, వసతులు, మౌలిక సదుపాయాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. బోధన, తరగతి గదిలో పరిస్థితిపై ఆరా తీశారు. విద్యా పురోగతి తెలుసుకోవడం కోసం పాఠాలు బోధించారు. బాగా చదువుకోవాలని, ఏవైనా సమస్యలు వస్తే తనకు ఫోన్ చేయాలని భరోసా ఇచ్చారు. ప్రాంగణం లోనికి అనుమతి లేకుండా అపరిచిత వ్యక్తులు వస్తే పోలీసులకు తక్షణ సమాచారం ఇవ్వాలని సూచించారు.

విషాదం

- వేర్వేరు చోట్ల ఇద్దరు బాలురు మృతి
- కాలువలో మునిగి ఒకరు.. నదిలో పడి మరొకరు మృత్యువాత

మల్కన్‌గిరి:

మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి మందాపల్లి పంచాయతీ పులిమేట్ల గ్రామంలో గురువారం కాలువలో పడి ఎనిమిదేళ్ల బాలుడు గణేష్ మృతి చెందాడు. 4వ తరగతి చదువుతున్న గణేష్ స్కూల్ నుంచి వచ్చాక గ్రామ సమీపంలోని కాలువలో స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు మునిగిపోవడంతో తోటి బాలురు కేకలు వేశారు. స్థానిక రైతులు స్పందించి బాలుడ్ని బయటకు తీసి తండ్రికి సమాచారం అందించారు. వెంటనే కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం అనంతరం శుక్రవారం తల్లిదండ్రులకు అప్పగిస్తామని కలిమెల ఐఐసీ ముకుందో మేల్కా తెలిపారు.



గణేష్ మృతదేహం



హేమంత్ మఝి(ఫైల్)

జయపురం: బొయిపరిగుడ సమితి పూజారిగుడ పంచాయతీ సనపావలిగుడలో గురువారం శుక్ర మఝి కుమారుడు ఐదేళ్ల హేమంత్ మఝి సమీప నదిలో ప్రమాదవశాత్తు మునిగి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఇంటికి వచ్చాక ఇద్దరు పిల్లలతో స్నానం చేసేందుకు నదికి వెళ్లాడు. అక్కడ కాలు జారి నీటిలో పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి బొయిపరిగుడ పోలీసులకు సమాచారం అందించారు.

విద్యాసంస్థల్లో ప్రత్యేక హెల్ప్‌లైన్లు

భువనేశ్వర్: బాలాసోర్ ఫకీర్ మోహన్ కళాశాల విద్యార్థిని ఆత్మాహుతి ఘటన నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. విద్యాసంస్థల ప్రాంగణాల్లో విద్యార్థులు, బోధన సిబ్బంది భద్రత, రక్షణ పట్ల కార్యాచరణ కట్టుదిట్టం చేసింది. ప్రధానంగా విద్యార్థినులు, ఉపాధ్యాయినులు, మహిళా సిబ్బంది పట్ల లైంగిక వేధింపులు వంటి ఘటనలకు తావు లేకుండా రాష్ట్ర పాఠశాలలు, సామూహిక విద్యా శాఖ ఈ మేరకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మేరకు పాఠశాలలు, సామూహిక విద్యా శాఖ కార్యదర్శి షాలిని పండిట్ అన్ని జిల్లా విద్యా శాఖ అధికారులు, జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లకు ఆదేశాలు జారీ చేశారు.విధుల నిర్వహణ ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు (నివారణ, నిషేధం, పరిష్కారం) చట్టం, 2013ని కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. విద్యా సంస్థలలో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు (ఐసీసీలు) కార్యాచరణ చురుకుగా కొనసాగాలని, క్రమం తప్పకుండా ఫిర్యాదుల్ని సమీక్షించి సకాలంలో తగిన చర్యలు పట్ల స్పందించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికల విద్యార్థుల శారీరక, మానసిక, సామాజిక, భావోద్వేగ కదలిక పట్ల దృష్టి సారించి, పాఠశాలల్లో సురక్షితమైన సమగ్ర సహాయక వాతావరణం నెలకొల్పాలని సూచించారు. విద్యార్థుల్లో లైంగిక ఆధారిత హింస నివారణకు సామాజిక శాస్త్ర పాఠ్యాంశాలతో అనుసంధానించబడిన అన్ని ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో బర్నాలి (లింగ సమానత్వ కార్యక్రమం)ను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు.



సమావేశమైన సీఎం, అధికారులు

హెల్ప్‌లైన్ ప్రదర్శన తప్పనిసరి..

విద్యా సంస్థల ప్రాంగణాల్లో సత్వర స్పందనకు అవసరమైన హెల్ప్‌లైన్ నంబర్ల ప్రదర్శన తప్పనిసరి చేసి ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలలు, హాస్టళ్లు, అనుబంధ ప్రాంగణాల్లో హెల్ప్‌లైన్ నంబర్(మహిళా హెల్ప్‌లైన్ – 181, చైల్డ్ హెల్ప్‌లైన్ – 1098, పోలీస్ హెల్ప్‌లైన్– 112, పాఠశాల విద్యార్థి హెల్ప్‌లైన్ – 18003456722)లను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించింది.

క్లుప్తంగా

మార్కెట్ కమిటీ చైర్మన్ల నియామకం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో నాలుగు మార్కెట్ కమిటీల చైర్మన్ల నియమించినట్లు తెలిపారు. పాతపట్నం నియోజకవర్గంలో హిరమండలం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మామిడి రామకృష్ణ (జనసేన), పాతపట్నం చైర్‌పర్సన్‌గా గౌరమ్మ చిన్నింటి, ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని కంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మద్దిలి విజయలక్ష్మి (టీడీపీ), శ్రీకాకుళం నియోజకవర్గంలోని శ్రీకాకుళం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా దారపు జ్యోత్స్న(జనసేన) ను నియమించినట్లు తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

పొందూరు: స్థానిక కచేరీ వీధికి చెందిన చిరు వ్యాపారి ఎరబోతు దుర్గారావు(28) బుధవారం రాత్రి తన ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులు వేసుకుని ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. రాత్రి కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి తెరిచిచూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. గురువారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని పోలీసులు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

గంజాయితో ఇద్దరు అరెస్టు


స్వాధీనం చేసుకున్న గంజాయి

ఇచ్ఛాపురం టౌన్: ఒడిశా నుంచి ముంబాయికి 22.566 కిలోల గంజాయి తరలిస్తున్న ఒడిశా రాష్ట్రం మోహన బ్లాక్‌కు చెందిన తులుషా నాయిక్, సామ్సన్ బీరోలను అరెస్టు చేసినట్లు సోంపేట ఎక్సైజ్ మొబైల్ సీఐ జీవీ రమణ తెలిపారు. జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ సూపరింటెండెంట్ మురళీధర్ ఆధ్వర్యంలో సోంపేట మొబైల్ ఎక్సైజ్ బృందం ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ చుట్టుపక్కల గురువారం తనిఖీలు చేపట్టింది. ఆ సమయంలో అనుమానాస్పదంగా తులుషా నాయిక్, సామ్సన్ బీరోలు తిరుగుతుండగా గమనించి వారి లగేజీ తనిఖీ చేశారు. దీంతో వారి వద్ద 22.566 కిలోల గంజాయి పట్టుబడడంతో అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాలోని జితున్ అనే వ్యక్తి వీరి ద్వారా ట్రైన్‌లో ముంబాయికి గంజాయి తరలించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు విచారణలో తేలింది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.లక్ష వరకు ఉంటుందన్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐ ఐ.సుజాత, సిబ్బంది శ్రీనివాస్, విజయ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ తూకంలో తేడా వస్తే చర్యలు


మెట్టవలసలో స్థలంను పరిశీలిస్తున్న అధికారులు

జి.సిగడాం: ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యం తూకంలో తేడా వస్తే ఉపేక్షించేది లేదని శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.సాయి ప్రత్యూష హెచ్చరించారు. మండల కేంద్రంలోని పౌర సరఫరాల గిడ్డంగిని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ డిపో డీలర్లకు బియ్యం తరుగుదల లేకుండా పంపిణీ చేయాలని, ఎక్కడైనా బియ్యం తరుగుదల వస్తే వెంటనే సంబంధిత గోదాం అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రేషన్ సరుకులు లబ్ధిదారులకు సకాలంలో అందేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎఫ్‌సీ గోదాం నుంచి వస్తున్న బియ్యాన్ని తూకం వేసి తీసుకోవాలన్నారు. అనంతరం మెట్టవలస గ్రామంలో మందుగుండు సామాగ్రి విక్రయించేందుకు షాపు నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుడి స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకే అనుమతులు ఇస్తామన్నారు. ఆమెతో పాటు తహసీల్దార్ మహాదేవు సరిత, ఆర్ఐ అబోతుల రాధ, వీఆర్వో లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

పక్కాగా ప్రీస్కూల్ నిర్వహణ

సారవకోట: అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీ స్కూల్ నిర్వాహణ పక్కాగా జరగాలని సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎస్.అనూరాధ సిబ్బందికి సూచించారు. గురువారం సారవకోట మండల పరిషత్ సమావేశ మందిరంలో సారవకోట, జలుమూరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీపీ-1, పీపీ-2 పాఠ్య పుస్తకాలలో ఉన్న సబ్జెక్టు మేరకు ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీ స్కూల్ నిర్వహణ చేపట్టాలన్నారు. కేంద్రాల నిర్వహణ, లబ్ధిదారులకు అందాల్సిన పౌష్టికాహారం తదితర వివరాలను యాప్‌లలో నమోదు చేయాలన్నారు. సూపర్ వైజర్లు సుజాత, సీతారత్నం, మనోహరి పాల్గొన్నారు.

పరిశుభ్ర నగరంగా భువనేశ్వర్

భువనేశ్వర్: భువనేశ్వర్ జాతీయ స్థాయిలో 10 పరిశుభ్రమైన నగరాల్లో ఒకటిగా నిలిచింది. ప్రతిష్టాత్మకమైన స్వచ్ఛ సర్వేక్షణ్ 2024లో నగరం 9వ ర్యాంక్‌ను సాధించింది. పట్టణ పరిశుభ్రత పట్ల నిబద్ధత రంగంలో గంజాం జిల్లాలో అసికా, చికిటి నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్ (ఎన్ఏసీ) వరుసగా 50,000, 20,000 లోపు జనాభా విభాగంలో స్వచ్ఛ్ సెహర్ అవార్డును సొంతం చేసుకున్నాయి. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ పురస్కారాల్ని ప్రదానం చేశారు. రాష్ట్ర గృహనిర్మాణం, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ కృష్ణ చంద్ర మహాపాత్రో, సీనియర్ అధికారులు, పట్టణ సంస్థల ప్రతినిధుల సమక్షంలో ఈ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి శాఖను అభినందించారు. స్వచ్ఛ, సమృద్ధి ఒడిశా ఆవిష్కరణ కోసం నిరంతరం కృషి చేయాలని సూచించాచారు.


రాష్ట్రపతి చేతుల మీదుగా స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారం అందుకుంటున్న మంత్రి కృష్ణచంద్ర మహాపాత్రో

ప్రయాణికుల రైళ్లు పునరుద్ధరించాలని వినతి

కొరాపుట్: కొరాపుట్-జయపూర్ మధ్య ప్రయాణికుల రైళ్లను పునరుద్ధరించాలని జయపూర్ చాంబర్ ఆఫ్ కామర్స్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అధ్యక్షుడు వి.ప్రభాకర్ రైల్వే ఉన్నతాధికారులకు లేఖ రాశారు. ఈ నెల 2న జయపూర్-కొరాపుట్ మధ్య మట్టి చరియలు ట్రాక్‌పైకి రావడంతో రైళ్లను నిలిపివేశారని చెప్పారు. రైల్వే సిబ్బంది ఆరో తేదీ నాటికే మార్గం సుగమం చేసినా కేవలం గూడ్స్ రైళ్లు మాత్రమే నడుస్తున్నాయని తెలిపారు. ప్రయాణికుల రైళ్లు కొరాపుట్ నుంచి వెనుదిరుగుతున్నాయని పేర్కొన్నారు. విశాఖపట్నం, భువనేశ్వర్, కోల్‌కతా, రౌర్కెలా రైళ్లు కొరాపుట్ వరకే నడుస్తున్నాయని తెలిపారు. సమీప ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం జగదల్‌పూర్‌తో పాటు కొట్‌పాడ్, జయపూర్ స్టేషన్లలో రైళ్లు ఎక్కాల్సిన ప్రయాణికులు కొరాపుట్ రోడ్డు మార్గాన వెళ్లాల్సి వస్తోందన్నారు. కొరాపుట్‌లో దిగిన వారు కిరండోల్ వరకు ట్యాక్సీలో వెళ్తే రూ.5000 వరకు ఖర్చు అవుతుందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొరాపుట్ నుంచి కిరండోల్ వరకు యథావిధిగా రైళ్లు నడపాలని విజ్ఞప్తి చేశారు. ఈ లేఖలను వాల్తేర్ డీఆర్ఎం, ఈస్ట్ కోస్ట్ జీఎం, ఎంపీ సప్తగిరి ఉల్క, రైల్వే మంత్రి అశ్విని శ్రీ వైష్ణవ్‌లకు పంపించారు.


వి.ప్రభాకర్, ప్రెసిడెంట్

సారా, మద్యాన్ని అరికట్టాలి

జయపురం: సారా, మద్యాన్ని అరికట్టాలని జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి మహులి గ్రామ పంచాయతీ బిచలకోట గ్రామ ప్రజలు బొయిపరిగుడ పోలీసులకు గురువారం వినతిపత్రం సమర్పించారు. గ్రామ ప్రజలు బొయిపరిగుడ అబ్కారీ కార్యాలయానికి వెళ్లారు. అబ్కారీ అధికారి లేక పోవటంతో పోలీసు స్టేషన్‌కు వచ్చి పోలీసు అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. మహులి పంచాయతీ కుంబారగుడ కాలనీగుడ, బెడగుడ, కొలాబ్ నదీ ప్రవాహిత ప్రాంత బాడిజొడి చొటనాళ ప్రాంతంలో నాటు సారా బట్టీలను బంద్ చేయాలని డిమాండ్ చేశారు. కొట్ట జంక్షన్‌లో విదేశీ మద్యం జోరుగా విక్రయిస్తున్నారని, వాటిని అరికట్టాలని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తమ ప్రాంతంలో నాటు సారా వంటకాలను, అమ్మకాలను అరికట్టేందుకు ప్రతి గ్రామానికి వెళ్లి సభలు, సమావేశాల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తున్నామని వెల్లడించారు. సారాకు బానిస కావడం వల్ల యువత భవిష్యత్ అంధకారం అవుతుందన్నాచారు. సారా వలన తక్కువ వయసులోనే మహిళలు వితంతువులు అవుతున్నారని, గ్రామాలలో సారా అమ్మటం వలన అశాంతి, కుటుంబాల్లో కలహాలు ఏర్పడుతున్నాయన్నారు. యువకులు శాంతి భద్రతలకు విఘాతం కల్పించటమే కాకుండా.. హత్యలకు, కొట్లాటలకు కారణమవుతున్నారన్నారు. సారా నుంచి ప్రజలకు ముక్తి కల్పించాలని, ప్రజలను చైతన్యవంతులను చేయాలని, అధికారులు సహకరించాలన్నారు.


పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న బిచలకోట గ్రామస్తులు

పాతపట్నంలో ట్రాఫిక్ సమస్య

పాతపట్నం: మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పాతపట్నం సెయింట్‌ఆన్స్ పాఠశాల వద్ద గురువారం ఉదయం ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల కేంద్రంలో 13 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఉదయం పాఠశాలలు తెరిచేటప్పుడు, సాయంత్రం విడిచిపెట్టే సమయంలో విపరీతంగా ట్రాఫిక్ ఉంటోంది. ఇటీవల ట్రావెల్స్ బస్సులు కూడా ప్రధాన రహదారిలో ప్రయాణికులను దించేటప్పుడు ట్రాఫిక్ ఉన్నచోట నిలిపివేస్తుండడంతో ఇబ్బందులు మరింత పెరుగుతున్నాయి. అందువలన ఇప్పటికైనా పోలీసులు స్పందించి ట్రాఫిక్ లేకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు.


నిలిచిపోయిన ట్రాఫిక్

వేధింపుల నుంచి రక్షణ కల్పించండి

టెక్కలి: టెక్కలి ఆర్డీవోతో పాటు కొంతమంది వ్యక్తులు తనకు చెందిన స్థలం విషయమై చేస్తున్న వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని నందిగాం మండలంలోని బడగాం గ్రామానికి చెందిన బలగ ప్రకాశ్ కోరారు. ఈ మేరకు గురువారం విశాఖపట్నం పర్యటనకు విచ్చేసిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఆనుకుని సర్వే నంబర్లు 520/1, 520/3 లో అన్ని రకాల అనుమతులతో ఉన్నటువంటి తనకు చెందిన స్థలంపై లేనిపోని వివాదాలు సృష్టించి, మానసికంగా వేధింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. టెక్కలి ఆర్డీవోతో పాటు మరో ముగ్గురు వ్యక్తులు తనను మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. దళితుడైన తనకు రక్షణ కల్పించాలని విన్నవించాడు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

టెక్కలి రూరల్:

సంతబొమ్మాళి మండలంలోని పాలేశ్వరమ్మ ఆలయం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు.. బోరుభద్ర పంచాయతీ పరిధి ఉదయ్‌పురం గ్రామానికి చెందిన భార్యాభర్తలు వంకల సంజీవ్, వంకల సరస్వతీలు తమ గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై టెక్కలి మండలంలోని రావివలస గ్రామం వైపు వస్తుండగా పాలేశ్వరమ్మ గుడి సమీపంలో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో బైక్‌పై ఉన్నటువంటి ఇరువురికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గాయపడినవారిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే సంజీవ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై సంతబొమ్మాళి పోలీసులకు సమాచారం అందించారు. అయితే వీరు వస్తున్న ద్విచక్ర వాహనానికి వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొనడం వలన ప్రమాదం జరిగి ఉంటుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


గాయపడిన సరస్వతీ


తీవ్రగాయాలకు గురైన సంజీవ్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, నగర కన్వీనర్ ఆర్.ప్రకాష్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర అధ్యక్షుడు అరుగుల గణేష్‌లు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా మున్సిపల్ వర్కర్స్ - ఎంప్లాయిస్ ఫెడరేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరపాలక కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినప్పటికీ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని దుయ్యబట్టారు. గత రాష్ట్రవ్యాప్త సమ్మె సమయంలో ప్రభుత్వం అంగీకరించిన ఒప్పందాలకు జీవోలు జారీ చేయకపోవడం, ఆప్కాస్ సంస్థను సైతం రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలనుకోవడం సరికాదని మండిపడ్డారు.

ప్రభుత్వ పథకాలు అందజేయాలి

తల్లికి వందనం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు కూడా అందజేయాలని కోరారు. గత 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలైన రిటైర్మెంట్ బెనిఫిట్స్, హామీలకు జీవో జారీ చేయ్యాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, గ్రాట్యూటీ చెల్లించాలని విన్నవించారు. ఇప్పటికైనా అట్టడుగు వర్గాలుగా ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు పరిష్కరించాలన్నారు. లేకుంటే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. వీరికి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం, పట్టణ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ ఎం.గోవర్ధనరావు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పి.చంద్రరావులు మద్దతు తెలిపారు.

అమృత్ భారత్ స్టేషన్ పనుల పరిశీలన


బరంపురం ప్రాంతంలో డీఆర్ఎం పర్యవేక్షణ

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే ఖుర్దా రోడ్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న అమృత్ భారత్ స్టేషన్ పనుల అభివృద్ధిని స్థానిక మండల రైల్వే అధికారి (డీఆర్ఎం) హెచ్.ఎస్.బజ్వా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఖుర్దా రోడ్ నుంచి బరంపురం వరకు ప్రయాణికుల సౌకర్యాల కోసం ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలు, భద్రత అంశాల్ని క్షుణ్ణంగా పర్యవేక్షించారు. దారి పొడవునా పలు స్టేషన్లలో ఆకస్మికంగా క్షేత్ర స్థాయి తనిఖీలు నిర్వహించారు. బరంపురం, బలుగాంప్, ఇచ్ఛాపురం, ఛత్రపూర్ స్టేషన్లలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పనుల పురోగతిని సమీక్షించారు.

నలుగురు వైద్యులు సస్పెన్షన్

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో నలుగురు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రం సామాజిక ఆరోగ్య అధికారులను సస్పెండ్ చేస్తున్నట్టు జిల్లా ముఖ్యవైద్యాధికారి, డీపీహెచ్‌వో డాక్టర్ మహమ్మద్ ముబారక్ అలీ గురువారం తెలిపారు. మోహనా బ్లాక్‌లో పాణిగండ, రాయిపంక, బుదులి, ఆర్.ఉదయగిరిలోని శియ్యాళిలోట్టి గ్రామ పంచాయతీలో కమ్యూనిటీ హెల్త్ అధికారులు తరచూ విధులకు గైర్హాజరవుతున్నట్టు ప్రజలు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విచారణ చేసివారిని సస్పెండ్ చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం వారి స్థానంలో ప్రత్యేక సూపర్‌వైజర్ టీం గిరిజన గ్రామాల్లో పనిచేస్తున్నట్టు పేర్కొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న సీడీఎంవో డాక్టర్ ఎం.ఎం.అలీ

కాగిత రహిత పాలనకు ప్రాధాన్యం

- ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి


మాట్లాడుతున్న మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: ప్రజా సేవల రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అనుసంధానంతో డిజిటల్ కార్యకలాపాలు అభివృద్ధి పరచి క్రమంగా కాగిత రహిత కార్యకలాపాలకు ప్రాధాన్యత కల్పించాల్సి ఉందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం, భారత ప్రభుత్వ పరిపాలనా సంస్కరణలు - ప్రజా ఫిర్యాదుల విభాగం సంయుక్తంగా నిర్వహించిన రెండు రోజుల జాతీయ సుపరిపాలన పద్ధతులపై సమావేశం గురువారం స్థానిక లోక్ సేవా భవన్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా సీఎం ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ హాజరయ్యారు. డిజిటల్ అధికారిక కార్యకలాపాల్లో రాష్ట్రం సాధించిన పురోగతితో కాగిత రహిత బడ్జెట్, సాంకేతికత ఆధారిత ఫిర్యాదుల పరిష్కారం వరకు వివిధ కార్యకలాపాల్ని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి వివరించారు. 2047 నాటికి వికసిత భారత్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా సంస్కరణ కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్నారు. అధికార పెత్తనానికి తెర దించి ప్రజా స్పందన పాలనకు పట్టం గట్టే రీతిలో సంస్కరణలు చేపడతున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సుకు దేశం నలుమూలల నుంచి హాజరైన 400 మందికిపైగా ప్రతినిధుల చర్చలు, సలహాలు, సంప్రదింపులతో ప్రజా సుపరిపాలనలో ఉత్తమ పద్ధతులు, ఆధునిక పాలన విధానా ఆవిష్కరణల ఈ సమావేశం లక్ష్యంగా పేర్కొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు


ప్రభుత్వ విధానాలపై నినదిస్తున్న వామపక్ష నేతలు

- ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి
- వామపక్ష నాయకుల డిమాండ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దని, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ వామపక్ష నాయకులు సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్ సీపీఎం కార్యాలయంలో విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్త లు మాట్లాడుతూ.. విద్యుత్ చార్జీలపై ఆగస్టు 5వ తేదీన విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయాల వద్ద చేప ట్టనున్న ధర్నాలను జయప్రదం చేయాలని కోరా రు. ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు బద్దలుగొ ట్టండి అని యువగళం పాదయాత్రలో లోకేష్ పిలు పునిచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడం మోసం కాదా అని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లు ద్వారా ప్రజలను తీవ్రంగా దోపిడీ చేయడానికి పూనుకుంటున్నారని మండిపడ్డారు.

అధికారంలోకి వచ్చాక మోసం

ఇప్పటికే పెరిగిన విద్యుత్ బిల్లులతో సామాన్య ప్రజలు గగ్గోలు పెడుతున్నారని, ఎన్నికలకు ముందు కూటమి నాయకులు కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు అత్యధికంగా విద్యుత్ చార్జీలు వసూలు చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని దుయ్యబట్టారు. అదానీ స్మార్ట్ మీటర్ల ఖర్చులు నిమిత్తం 93 నెలల్లో అదనపు చార్జీలు వసూలు చేస్తారన్నారు. వాటిని ఇళ్లకు బిగించకుండా ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. దక్షిణాదిలో కేరళ, బెంగాల్, తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాయని తెలియజేశారు. రాష్ట్రంలో రెండు కోట్ల మీటర్లు పెట్టి రూ.25 వేల కోట్ల భారం ప్రజల మీద వేసేందుకు పూనుకున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమం ఉద్ధృతం చేయాలని పిలుపునిచ్చారు. జూలై 18 నుంచి 22 వరకు పట్టణ, మండల కేంద్రాల్లో సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పి.చంద్రరావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ ఎం.గోవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

కాశీబుగ్గ: కార్గో ఎయిర్‌పోర్టుకు సంబంధించి బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.బాలాజీరావు, తమ్మినాన భాస్కరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.గణపతి పిలుపునిచ్చారు. గురువారం పలాస సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్దానం తీర ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ కార్గో ఎయిర్‌పోర్టు కోసం రైతుల అభిప్రాయం తెలుసుకోకుండా భూముల సర్వే చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. పచ్చని ఉద్దానం విధ్వంసానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంటోందని, ప్రజల ప్రయోజనాలకు భిన్నంగా ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు విచారకరమన్నారు. ఎవరు ఎన్ని ఆందోళనలు, ధర్నాలు చేసినా ఎయిర్‌పోర్టు నిర్మాణం ఆగదని స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రకటన రైతులను రెచ్చగొట్టే విధంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

పరీక్ష పాట్లు..?


శ్రీకాకుళంలోని ఒక ప్రభుత్వ కళాశాలలో యూనిట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

- ప్రారంభమైన ఇంటర్మీయట్ యూనిట్ పరీక్షలు
- చాలాచోట్ల ప్రశ్నాపత్రాలు అందక అవస్థలు
- కొన్నిచోట్ల డిక్టేట్ చేస్తుంటే రాస్తున్న వైనం
- ఆందోళన చెందుతున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

ఇంటర్మీడియట్ విద్యార్థులకు మొదటి యూనిట్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, సాంఘిక, గిరిజన, గురుకులం, మోడల్ కాలేజీలు, కేజీబీవీలు, హైస్కూల్ ప్లస్‌లలో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులు ఈ పరీక్షలను రాస్తున్నారు. రోజుకు రెండు పరీక్షలు చొప్పున పరీక్షలు జరుగుతున్నాయి. మొదటి సెషన్ ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతోంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి...

పునర్విభజన శ్రీకాకుళం జిల్లాలో అన్ని ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కాలేజీలు 94 ఉన్నాయి. వీటిల్లో 19 వేల మంది వరకు విద్యార్థులు వివిధ ఇంటర్ కోర్సుల్లో చదువుతున్నారు. ఈ యూనిట్ పరీక్షల కోసం గత పది రోజులుగా ఇంటర్ బోర్డు నానా హడావుడి చేసినప్పటికీ.. ప్రశ్నాపత్రాలను విద్యార్థులకు చేర్చడంలో సఫలీకృతం కాలేదని తెలుస్తోంది. ప్రశ్నాపత్రాలను విద్యార్థులకు అందజేసేందుకు కాలేజీల్లో నానా అగచాట్లు పడుతున్నారు. పరీక్షకు స్వల్ప వ్యవధి ముందు క్వశ్చన్ పేపర్‌ను వెబ్‌సైట్‌లో పెడుతుండడంతో ప్రిన్సిపాల్స్ కష్టాలు అన్నీఇన్నీ కావు.


డౌన్‌లోడ్ చేసి.. డిక్టేట్ చేస్తున్నారు..

ఇదిలా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా అన్ని యాజమాన్యాల విద్యార్థులు యూనిట్ టెస్టులు, త్రైమాసిక, అర్ధ సంవత్సర పరీక్షలను ఒకే ప్రశ్నాపత్రంతో రాసే విధానాన్ని 2023లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చారు. నాటి ప్రభుత్వ ఆదేశాలతో ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు చేసిన ప్రయత్నం మంచి ఫలితాలను ఇచ్చింది. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ తాజాగా జరుగుతున్న యూనిట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను విద్యార్థులకు మెజారిటీ కాలేజీల్లో అందజేయలేదని తెలుస్తోంది. ప్రశ్నాపత్రాలను విద్యార్థులకు అందజేయాల్సిందేనని జిల్లా అధికారులు ఆదేశించినప్పటికీ.. వివిధ కాలేజీల్లో ప్రశ్నాపత్రాలను ఇంటర్ బోర్డు వెబ్‌పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు డిక్టేట్ చేసినట్లు సమాచారం. ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌పై లేదా బ్లాక్ బోర్డులపై క్వశ్చన్ పేపర్లలోని ప్రశ్నలను లెక్చరర్లు రాసి, తమను రాసుకోమంటున్నారని విద్యార్థులు చెబుతున్నారు. దీంతో ఇంగ్లిష్, మ్యాథ్స్, కామర్స్ ఇతర ఒకేషనల్ పేపర్ల సందర్భంలో చాంతడంత ప్రశ్నలు రాయాల్సిన దుస్థితి తలెత్తుకుని ఆందోళన చెందుతున్నారు.

ప్రిన్సిపాల్స్‌కు అష్టకష్టాలు

ఆ మధ్య యోగా డే, ఇటీవల మెగా పేరెంట్స్ మీటింగ్, తాజాగా యూనిట్ టెస్ట్ పరీక్షలు, మరోవైపు ఆన్‌లైన్ అడ్మిషన్లు ఇలా ప్రిన్సిపాల్స్‌కు ఊపిరి తీసుకునే సమయం ఉండడం లేదు. ప్రశ్నాపత్రాలను జిరాక్స్ తీసేందుకు తగినంత సమయం లేకపోవడం, నిధులు కేటాయించకపోవడం, గ్రామీణ ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు లేకపోవడం, కాలేజీల్లో వందలాది ప్రింట్లు తీసే ప్రింటర్లు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో అష్టకష్టాలు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే ప్రశ్నాపత్రంతో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్న సంగతి అటుంచితే.. మెజారిటీ కాలేజీల్లో నిర్దేశించిన సిలబస్ పూర్తి కాలేదని తెలుస్తోంది. చాలాచోట్ల ఇప్పటికీ వివిధ సబ్జెక్టుల లెక్చరర్లు లేరు. ఈ మధ్యనే రేషనలైజేషన్ ప్రక్రియ, లెక్చరర్ల బదిలీలు, ప్రిన్సిపాల్స్ పదోన్నతలతో ఏర్పడిన ఖాళీల భర్తీ ఇంకా పూర్తి కాలేదు. లెక్చరర్ల లేనిచోట దుస్థితి ఒకలా ఉంటే.. లెక్చరర్ల ఉన్నచోట్ల పరిస్థితి మరోలా ఉంది. విద్యార్థులకు చెప్పిన పాఠాలొకటి.. ఇచ్చిన ప్రశ్నలొకటని గుసగుసలు వినిపిస్తున్నాయి.

సూచనలు చేశాం



యూనిట్ టెస్ట్ పరీక్షలపై ప్రిన్సిపాల్స్‌కు అనేక సూచనలు చేయడం జరిగింది. పరీక్షల ప్రశ్నాపత్రాలను ప్రింటౌట్ తీసి విద్యార్థులకు అందజేయాలని ఆదేశించడమైంది. కచ్చితంగా ఇంటర్ బోర్డు ఉన్నతాధికారుల ఆదేశాలను కాలేజీల్లో అమలు చేయాల్సిందే. అమలు కాకుంటే చర్యలు తప్పవు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– పి.దుర్గారావు, జిల్లా ఆర్ఐవో, ఇన్‌చార్జ్ డీవీఈవో, శ్రీకాకుళం

క్లుప్తంగా

వాలీబాల్ విజేత ఏపీఈపీడీ సీఎల్ జట్టు



ప్రథమస్థానంలో నిలిచిన విజయనగరం ఏపీఈపీడీసీఎల్ జట్టు

విజయనగరం ఫోర్ట్: ఏపీ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ఇంటర్ సర్కిల్ వాలీబాల్ టోర్నమెంట్‌లో విజయనగరం ఏపీఈపీడీసీఎల్ జట్టు విజేతగా నిలిచింది. 2025–26 సంవత్సరానికి సంబంధించి కర్నూలు జిల్లా శ్రీశైలంలో ఈనెల 15 నుంచి17 వతేదీ వరకు ఇంటర్ సర్కిల్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో విజయనగరం జట్టు ప్రథమ స్థానంలో నిలవగా రాజమండి సర్కిల్ జట్టు ద్వితీయ స్థానం, తృతీయ స్థానంలో నెల్లూరు జట్టు నిలిచాయి.

తపాలా రాష్ట్రఆర్గనైజింగ్ కార్యదర్శిగా హేమలత



ఆర్గనైజింగ్ కార్యదర్శి హేమలత

బాడంగి: తపాలాశాఖ రాష్ట్ర ఉద్యోగుల ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆర్.హేమలత (పాల్తేరు పోస్టుమాస్టర్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల నంద్యాలలో జరిగిన ఏఐజీజీడీఎస్‌యూ 14వ వార్షిక ఎన్నికల్లో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆమె గురువారం చెప్పారు. అదేవిధంగా రాష్ట్ర యూనియన్ మహిళా కమిటీ మెంబర్‌గా కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆమె గతంలో తపాలా ఉద్యోగుల సంఘం బొబ్బిలి బ్రాంచికార్యదర్శిగా, రాష్ట్ర యూనియన్ ఉపాధ్యక్షురాలిగా, కేంద్ర ప్రత్యేక ఆహ్వానితురాలిగా కూడా సేవలందించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్రయూనియన్ నాయకులు, జీడీఎస్ సభ్యులందరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



మద్యం సీసాలు ధ్వంసం చేస్తున్న దృశ్యం

రాజాం సిటీ: స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం బాటిల్స్‌ను గురువారం ధ్వంసం చేశారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ దొర సమక్షంలో ఐదు కేసుల్లో పట్టుబడిన రూ.5,500లు విలువైన మద్యాన్ని పోలీసులు పారబోశారు. ఈ సందర్భంగా దొర మాట్లాడుతూ అక్రమంగా మద్యం విక్రయించినా, బెల్టుషాపులు నిర్వహించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సారా తయారుచేసినా, విక్రయించినా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్, ఎస్సై రవికిరణ్, రెవెన్యూ సిబ్బంది అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో 21 నెలల జైలు

డెంకాడ: మండలంలోని అక్కివరం గ్రామంలో జరిగిన దొంగతనం కేసులో విశాఖకు చెందిన మల్లి సూరిబాబుకు 21 నెలల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా చెల్లించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీనివాస రావు తీర్పు చెప్పినట్లు ఎస్సై ఎ.సన్యాసి నాయుడు గురువారం తెలిపారు. 2021వ సంవత్సరం నవంబర్ 27వ తేదీన అక్కివరం గ్రామంలోని నడిపల్లి రాజినాయుడు ఇంటిలోని బీరువాలో రూ.లక్షా 3వేల నగదు, ఏడు తులాల బంగారు ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించాడు. అప్పట్లో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై పద్మావతి కేసు దర్యాప్తు చేసి చార్జిషీట్ ఫైల్ చేశారు. మల్లి సూరిబాబు అనే వ్యక్తి ఈ దొంగతనానికి పాల్పడినట్లు కోర్టు నిర్ధారించి పై విధంగా శిక్ష విధించిందని ఎస్సై వివరించారు.

విద్యార్థులతో పీపుల్స్ స్టార్ సమావేశం



మాట్లాడుతున్న సినీనటుడు ఆర్.నారాయణ మూర్తి

పార్వతీపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో పీపుల్స్ స్టార్, సినీనటుడు ఆర్.నారాయణ మూర్తి గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్నేహ చిత్ర బ్యానర్ మీద యూనివర్సిటీ..పేపర్ లీక్ అనే చిత్రాన్ని తెరకెక్కించానని సేవా రంగంగా ఉండాల్సిన విద్యారంగం భారతదేశంలో వ్యాపార రంగంగా మారిందన్నారు. వ్యాపార రంగం కావడంతో చాలా ప్రైవేట్ సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయని, ఈ క్రమంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ మసకబారుతోందన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం కావాలి గానీ, మసకబార కూడదని, అందుకని సేవా రంగంలో ఉన్న విద్యను, వైద్యాన్ని జాతీయం చేయాలనే విషయాన్నే ఈ చిత్రంలో బలంగా చెప్పానన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతి రావు పాల్గొన్నారు.

టీచర్ల కష్టాలు ఇన్నిన్ని కాదయా..!

- నెలరోజులుగా యోగాంధ్ర, మెగా పేటీఎం పనులు
- ప్రస్తుతం లీడర్‌షిప్, ఎఫ్ఎల్ఎస్ శిక్షణతో బిజీ
- ప్రతి రోజూ గంట సమయం ఆన్‌లైన్ యాప్‌ల భారం
- పాఠాలు చెప్పడం కంటే ఫొటోల అప్‌లోడ్‌తోనే సరి
- మొరాయిస్తున్న యాప్‌లతో అవస్థలు
- బోధనకు దూరమవుతున్నామంటూ ఆవేదన



రామభద్రపురం చొక్కాపు వీధి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అటెండెన్స్ నమోదు చేస్తున్న హెచ్ఎం(ఫైల్)

రామభద్రపురం: కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖ తీసుకుంటున్న నిర్ణయాలతో పాఠశాల తెరిచి నెల రోజులు పూర్తవుతున్నా నేటికీ పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు తరగతి గదికి హాజరుకాలేని పరిస్థితి. బోధనేతర పనులతోనే ఉపాధ్యాయులు బిజీబిజీగా గడుపుతున్నారు. జిల్లాలో సుమారు 2,232 పాఠశాలలు ఉండగా 2,10,377 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారికి సుమారు 9,307 మంది ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఉపాధ్యాయుడు పాఠశాలకు వచ్చిన వెంటనే ఫేషియల్ అటెండెన్స్, విద్యార్థుల హాజరుకు సంబంధించి వివరాలు యాప్‌లో నమోదు చేయాలి. మరుగుదొడ్లు ఆయా శుభ్రం చేసిందా? లేదా? వాటి పరిస్థితి ఎలా ఉంది? మధ్యాహ్న భోజన వంటకాలు, విద్యార్థులకు వడ్డిస్తున్న ఫొటోలు పంపడం, విద్యార్థుల వివరాలు, విద్యార్థి మిత్ర కిట్ల నమోదు వంటి బోధనేతర పనులు ఉపాధ్యాయులే చేయాలి. అలాగే రోజురోజుకీ వాట్సాప్‌లో అర్జెంట్ మెసేజ్‌లు, ఆన్‌లైన్ వర్క్‌లు, వెబెక్స్ మీటింగ్‌లతో పాటు నెల రోజులుగా యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ వంటి కార్యక్రమాలతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. తరగతి గదిలో పాఠాలు చెప్పాల్సిన అయ్యోర్లు బోధనేతర పనులతో బిజీగా ఉండడంతో చదువులు అటకెక్కుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో ఆదరణ తగ్గుతోంది. దీంతో ఈ విద్యాసంవత్సరంలో ఒకటవ తరగతిలో విద్యార్థుల ప్రవేశాలు గణనీయంగా పడిపోయాయి.



నాయుడువలస పాఠశాలలో విద్యార్థులతో యోగా చేయిస్తున్న ఉపాధ్యాయులు(ఫైల్)

మొరాయిస్తున్న యాప్‌లతో అవస్థలు

మరో వైపు మొరాయిస్తున్న యాప్‌లతో సైతం ఉపాధ్యాయులు విసిగిపోతున్నారు. పాఠశాల విద్యాశాఖలో ఉన్న అన్ని యాప్‌లను ఒకే వేదికపైకి తీసుకువచ్చి లీప్ (లెర్నింగ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) యాప్‌ను రూపొందిచారు. దాంట్లోనే ఐఎంఎంఎస్, స్టూడెంట్స్ కిట్స్, మెగా పేటీఎం, వంటి వాటిని అనుసంధానం చేశారు. దీంతో సర్వర్ డౌన్ సమస్యలతో ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు.అలాగే విద్యామిత్ర కిట్లు విద్యార్థులకు అందినట్లు తల్లిదండ్రులతో బయోమెట్రిక్ వేయించాలని చెబుతున్నారు. కానీ ఏ పాఠశాలలో కూడా దీనికి సంబంధించిన డివైజ్‌లు అందుబాటులో లేని పరిస్థితి.పెద్ద స్కూళ్లలో క్లాస్ టీచర్‌కు ఒక వారం రోజులు ఇదే పనిలో ఉండాల్సిదేనని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

సన్నబియ్యం చుట్టూ తిరగాల్సిందే..

ఈ ఏడాది నుంచి మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి పాఠశాలలకు సన్నబియ్యం అందిస్తున్నారు.ప్రతి నెలా పాఠశాలలకు అందిన అన్ని బస్తాలపై క్యూఆర్‌కోడ్‌లను ఉపాధ్యాయులు స్కానింగ్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. తర్వాత వంటకు ముందు ఆ బస్తా ఓపెన్ చేసిన ప్రతిసారి క్యూఆర్ కోడ్‌ను స్కానింగ్ చేసి ఆ బస్తాలో ఉన్న బియ్యం క్వాలిటీ పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. లేందటే బియ్యం స్టాక్ గొడౌన్ నుంచి ఉపాధ్యాయులకు ఫోన్‌లు వస్తున్నాయి.

నెలంతా బోధనేతర కార్యక్రమాలే..

జూన్ 12వ తేదీన పాఠశాలలు తెరిచినా ఎస్జీటీలు, ఎంటీఎస్, వృత్తి విద్యా టీచర్స్ బదిలీల కౌన్సెలింగ్ నిర్వహణతో పదిహేను రోజులు గడిచిపోయాయి.

- అనంతరం గిన్నిస్ రికార్డు కోసం జూన్ 21న చేపట్టిన యోగాంధ్ర కోసం పాఠశాలల్లో ముందస్తుగానే ఆయా కార్యక్రమాలు చేపట్టాల్సి వచ్చింది. ఆ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు భాగస్వాములయ్యారు.
- ఆ తరువాత ఈ నెల 10వ తేదీన తలపెట్టిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాని(మెగా పేటీఎం)కి సంబంధించి పది రోజులు ముందుగానే వివిధ కార్యక్రమాలు చేపట్టారు.ఆ ఫొటోలు సరిగ్గా అప్‌లోడ్ కాలేదని, సక్రమంగా పంపించాలని మళ్లీ ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడంతో టీచర్స్ సరిచేసుకుని అప్‌లోడ్ చేశారు.
- హమ్మయ్య..అది కూడా ముగిసిందనుకుంటే ఈ నెల 14వ తేదీ నుంచి స్కూల్ లీడర్‌షిప్, ఎఫ్ఎల్ఎస్ వంటి శిక్షణ కార్యక్రమాలు ఈ నెలాఖరు వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

బోధనేతర పనుల ఒత్తిడిపై పోరాటం



పాఠశాలలు తెరిచి రెండో నెలలో ప్రవేశించినా ఉపాధ్యాయులు సంతృప్తిగా పాఠాలు బోధించిన దాఖలాలు లేవు.యోగా డే, పేరెంట్స్ మీటింగ్ సంబంధించి ఆన్‌లైన్ నమోదు ఇలా అనేక కార్యక్రమాలతో ఉపాధ్యాయులు తరగతి గదులకు దూరమవుతున్నారు. దీంతో తరగతులు సక్రమంగా జరగక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బోధనేతర పనులతో ఉపాధ్యాయులను కూడా ఒత్తిడికి గురి చేస్తున్నారు.బోధనేతర పనులు తగ్గించే వరకు అన్ని యూనియన్లు ఉమ్మడి పోరాటాలకు సిద్ధం కావాలి.

కె.విజయగౌరి, యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు

భవానీకి కలెక్టర్ అభినందనలు

- తక్షణమే ఇల్లు మంజూరుకు ఆదేశాలు



వెయిట్ లిఫ్టర్ రెడ్డి భవానీని సత్కరిస్తున్న కలెక్టర్

విజయనగరం: ఇటీవల కజకిస్థాన్‌లో జరిగిన జూనియర్ ఆసియన్ చాంపియన్ షిప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో వరుసగా 3 బంగారు పతకాలను సాధించి, జిల్లా కీర్తి పతాకాన్ని ఎగురవేసిన కొండకరకాం గ్రామానికి చెందిన క్రీడాకారిణి రెడ్డి భవానీని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అభినందించారు. ఈ మేరకు గురువారం తన క్యాంపు కార్యాలయంలో దుశ్శాలువ, జ్ఞాపికతో భవానీని సత్కరించారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ తరపున రూ.25వేల నగదు ప్రోత్సాహకాన్ని చెక్కు రూపంలో అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలంటూ ప్రోత్సహించారు. రెడ్డి భవాని నేపథ్యాన్ని, ఆర్థిక పరిస్థితిని కలెక్టర్ తెలుసుకుని అప్పటికప్పుడు తహసీల్దార్ కూర్మనాథరావును రప్పించి వెంటనే ఆమెకు ఇంటి పట్టా ఇవ్వాలని ఆదేశించారు. అలాగే హౌసింగ్ పీడీ మురళీమోహన్‌ను పిలిచి ఇల్లు మంజూరు చేయడమే కాకుండా, నిర్మాణ బాధ్యతను కూడా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులతో పాటు, జిల్లా క్రీడాధికారి వెంకటేశ్వరరావు, కోచ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



భవానీని సత్కరిస్తున్న దృశ్యం

వెయిట్‌లిఫ్టర్ భవానీకి హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ సత్కారం

కొండకరకాం క్రీడాకారిణి రెడ్డి భవాని భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందించాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈ మేరకు గురువారం హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ అధ్యక్షుడు దవడ కొండబాబు, దవడ మీనా అధ్యక్షతన భవానీకి జరిగిన సత్కార సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితిగజపతిరాజు, ఎంపీ కలిశెట్టి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఆమె పరిస్థితిని తీసుకువెళ్లాలని భీశెట్టి కోరారు, సత్కార సభలో కొత్తా సునీల్, ముంతాజమ్మ, స్రవంతి, కొండబాబు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రాజు, నాగభూషణం, రమేష్, రాంమోహన్, శ్రీను, రామచంద్ర రాజు తదితరులు భవానీకి ఆర్థిక సహాయం చేశారు.

రిటైర్డ్ ఉద్యోగి దుర్మరణం



రిటైర్డ్ ఉద్యోగి మృతదేహం

విజయనగరం క్రైమ్: జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ బంగ్లా వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లా విద్యాశాఖలో పనిచేసి రిటైర్ అయిన సూపరెంటెండెంట్ నడిపేన బంగారు నాయుడు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. జిల్లా విద్యాశాఖలో సూపరెంటెండెంట్‌గా పనిచేసిన నడిపేన బంగారు నాయుడు ఏడాది క్రితం రిటైర్ అయ్యారు. భార్య, డిగ్రీ చదువుతున్న కొడుకుతో నగరంలోని కామాక్షి నగర్‌లో సొంత ఇల్లు కట్టుకుని ఉంటున్నారు. నగరంలో పని ఉందంటూ ఇంటి నుంచి రాత్రి ఏడున్నర గంటల ప్రాంతంలో స్కూటీపై ఆయన బయటకు వచ్చారు. ఇంటినుంచి వస్తుండగా సరిగ్గా జేసీ బంగ్లా వద్దకు వచ్చేసరికి వెనుకగా ఒడిశా నుంచి మితిమీరిన వేగంతో వస్తున్న టింబర్ లారీ ఆయన స్కూటీని ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా బండిపై నుంచి ఆయన కింద పడిపోగా కింద పడిన వ్యక్తిని తప్పించి కనీసం ఏం జరిగిందో చూడకుండానే టింబర్ లారీ డ్రైవర్ వేగంగా వెళ్లిపోయి ముందుగా లారీని ఆపి పరారయ్యాడు. ఈ సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ప్రమాద సమాచారాన్ని వన్‌టౌన్ పోలీసులకు తెలియజేయడంతో సీఐ చౌదరి, ఎస్సై రమణ ఘటనా స్థలికి చేరుకుని యాక్సిడెంట్ వివరాలు తెలుసుకుని మృతదేహాన్ని ప్రైవేట్ అంబులెన్స్‌లో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే మృతుని భార్య, కొడుకు ఘటనా స్థలికి వచ్చి భోరున విలపించి లారీ డ్రైవర్‌ను అరెస్ట్ చేయాలంటూ డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయనగరం వన్ టౌన్ సీఐ చౌదరి మృతుని బంధువుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా లారీ డ్రైవర్ కోసం గాలింపు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ట్రాఫిక్ సబ్‌కంట్రోల్



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ట్రాఫిక్ సబ్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ వకల్ జిందల్, చిత్రంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు

విజయనగరం క్రైమ్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ట్రాఫిక్ సబ్ కంట్రోల్ రూమ్‌ను ఎస్పీ వకుల్ జిందల్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిందన్నారు. స్కూల్స్, కాలేజీలు, ఆస్పత్రులు, సినిమా హాల్స్ ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లోనే ఉండడం వల్ల ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ రద్దీ తరచూ ఏర్పడుతుందన్నారు. రద్దీ సమయాల్లో ట్రాఫిక్ రెగ్యులేషన్ చేపట్టడం కష్టంగా ఉంటుందని, దీనిని అధిగమించడానికే ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ట్రాఫిక్ సబ్ కంట్రోల్ ఏర్పాటు చేయాలని సంకల్పించామని ఇందులో భాగంగా ట్రాఫిక్ సబ్ కంట్రోల్ ను ఏర్పాటు చేసి, ప్రారంభించామన్నారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ విధులు నిర్వర్తించే సిబ్బంది తీవ్రమైన వేసవి, వర్షా కాలంలో సమర్ధవంతంగా విధులు నిర్వర్తించడానికి ఇబ్బంది లేకుండా ఈ సబ్ కంట్రోల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అదే విధంగా చిన్న చిన్న దొంగతనాలు, ఈవ్ టీజింగ్ వంటివి నియంత్రించ వచ్చునన్నారు. ఈ సబ్‌కంట్రోల్ రూమ్‌లో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ఏర్పాటు చేశామని, లౌడ్ స్పీకర్లను ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్ గేటు, ఔటు గేటు, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సబ్ కంట్రోల్‌లో ఒక ఎస్సై, ఒక ఏఎస్సై, ఇద్దరు హెచ్‌సీలు, ముగ్గురు కానిస్టేబుల్స్ ఉంటారని, వారు ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా విధులు నిర్వహిస్తారని ఎస్పీ తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందల్ పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాస రావు, ట్రాఫిక్ సీఐ సూరి నాయుడు, టూ టౌన్ సీఐ టి.శ్రీనివాసరావు, రూరల్ సీఐ బి.లక్ష్మణరావు, ట్రాఫిక్ ఎస్సైలు భాస్కరరావు, రవి, నూకరాజు , పీసీలు భాస్కర్, రమణలు పాల్గొన్నారు.

శంబర పోలమాంబ ఆలయ ఈఓగా శ్రీనివాసరావు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఈఓ శ్రీనివాసరావు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఆలయ ఈఓగా బి.శ్రీనివాస రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ఈఓగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై శంబర పోలమాంబ అమ్మవారి ఆలయ గ్రేడ్–1 ఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు పోలమాంబ అమ్మవారి ఆలయ ఈఓగా పనిచేసిన వి.వి.సూర్యనారాయణ పాలకొండ కోటదుర్గ అమ్మవారి ఆలయం, తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం , పార్వతీపురంలోని గ్రూపు దేవాలయాల అధికారిగా బదిలీ అయ్యారు.

ఏజెన్సీలో సీఆర్‌పీఎఫ్ బలగాల కూంబింగ్

మక్కువ: ఏజెన్సీ గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రాజ్‌కుమార్ నేతృత్వంలో గురువారం సీఆర్‌పీఎఫ్ బలగాలు కూంబింగ్ నిర్వహించాయి. మార్కొండపుట్టి, బొడ్డు సామంతవలస, ఎర్ర సామంతవలస, పనసబద్ర, దుగ్గేరు, మూలవలస తదితర గ్రామాల్లో అనుమానిత ప్రదేశాలను నిశితంగా పరిశీలించాయి. కల్వర్టుల వద్ద మెటల్‌డిటెక్టర్‌తో తనిఖీలు జరిపాయి.

ఆటోలో 46కిలోల గంజాయి పట్టివేత



గంజాయి తరలిస్తున్న నిందితులతో ఎస్పీ వకుల్ జిందల్,డీఎస్పీ శ్రీనివాస్ తదితరులు

- ఏడుగురు నిందితుల అరెస్ట్
- ఒడిశా నుంచి ఢిల్లీకి తరలింపు

విజయనగరం క్రైమ్: విజయనగరంలో వన్‌టౌన్ పోలీసులు, క్రైమ్ పార్టీ నగరంలోని ట్యాంక్ బండ్ వద్ద ఎల్ఐసీ బిల్డింగ్ దగ్గర 46 కేజీల గంజాయిని గురువారం పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి ఎస్పీ వకుల్ జిందల్ గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం వన్ టౌన్ పోలీసులకు వచ్చిన కచ్చితమైన సమాచారంతో ఆటోలో ఒడిశా రాష్ట్రం నుంచి హైదరాబాద్ మీదుగా ఢిల్లీకి తరలించేదుకు తరలిస్తున్న 46కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. కాగా ఆటోలో పోలీసులు తనిఖీ చేయగా బ్యాగుల్లో 46 కేజీలు గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించి దాన్ని తరలిస్తున్న ఏడుగురు నిందితులైన చందక శ్రీను (28) చొంపి దివాకర్ (22) చొంపి కళ్యాణ్, (24) తంగుళ కిరణ్ కుమార్ (21), చొంపి సన్యాసి రావు (20) పిల్లా శివ (24) పిల్లా కమాలాకర్ (22) అనే ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.అలాగే ఆటో తో పాటు 46కిలోల గంజాయి, ఒక పల్సర్ బైక్, 5 సెల్‌ఫోన్లు, రూ.8 వేలు సీజ్ చేశారు. పట్టుబడిన నిందితులను విచారణ చేయగా పెదబయలుకు చెందిన చందక శ్రీను గంజాయిని ఆటోలో విజయనగరం తీసుకువచ్చి ఇక్కడి నుంచి కాకినాడకు చెందిన మరో ఇద్దరి ద్వారా హైదరాబాద్ కు తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారని ఎస్పీ వకుల్ జిందల్ చెప్పారు. పరారైన ప్రధాన నిందితుడు అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలుకు చెందిన రాంబాబును అరెస్టు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, వన్ టౌన్ సీఐ ఆర్.వి.ఆర్.కె చౌదరి, ఎస్ఐలు బి.సురేంద్ర నాయుడు, డి.రామ్ గణేష్ ఇతర పోలీసు సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందల్ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

కారు ఢీకొని వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



తవిటిరాజు మృతదేహం



మృతిచెందిన తవిటిరాజు (ఫైల్)

సీతంపేట: రాంగ్‌రూట్‌లో వచ్చిన ఒక కారు వైఎస్సార్‌సీపీ నాయకుడు సవర తవిటిరాజు (48) ప్రాణాలు బలిగొంది. సీతంపేట మండలంలోని చీడి మానుగూడకు చెందిన హడ్డుబంగి ఎంపీటీసీ ఎస్.సరోజిని భర్త తవిటిరాజు తన ద్విచక్రవాహనంపై సీతంపేట వస్తుండగా ఎదురుగా పాలకొండ నుంచి కొత్తూరు వైపు వెళ్తున్న కారు కంబగూడ గ్రామ మలుపువద్ద రాంగ్‌రూట్‌లో వచ్చి బలంగా ఢీకొట్టింది. దీంతో తవిటిరాజు కాలువిరిగి, తలకు బలమైన గాయం తగలడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. మృతుడికి భార్య సరోజిని, ఇద్దరు కుమార్తెలు సావిత్రి, తిరుమల, కుమారుడు సంతోష్ ఉన్నారు. సీతంపేటకు పనిమీద వెళ్లిన భర్త రోడ్డు ప్రమాదంలో చనిపోయాడన్న విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులంతా ఏరియా ఆస్పత్రికి చేరుకుని గుండెలవిసేలా రోదించారు. స్థానిక ఎస్సై వై.అమ్మన్నరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కన్నీటి పర్యంతమైన మాజీ ఎమ్మెల్యే కళావతి

ఎంపీటీసీ సరోజిని భర్త తవిటినాయుడు మరణవార్త విన్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి హుటాహుటిన సీతంపేట ప్రాంతీయ ఆస్పత్రికి వచ్చి మృతదేహాన్ని చూసి కంటతడి పెట్టారు. మంచికి మారుపేరు అయిన తవిటిరాజును మరువలేమన్నారు. రోదిస్తున్న ఎంపీటీసీ సరోజినిని, కుటుంబ సభ్యులను ఓదార్చారు. తాను మీకుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎంపీపీ బి.ఆదినారాయణ, ఎస్టీసెల్ నియోజకవర్గ కన్వీనర్ నిమ్మక కాంతారావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి, సర్పంచ్‌లు బి.తిరుపతిరావు, ఎస్.సుశీల, ఎంపీటీసీలు ఎస్.చంద్రశేఖర్, ఎస్.మంగయ్య, పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.



ఆస్పత్రి వద్ద మృతుని భార్యను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు

లారీ కింద పడి వ్యక్తి దుర్మరణం



108లో తరలిస్తుండగా మృతిచెందిన సత్యనారాయణ

బొబ్బిలి: పట్టణ సమీపంలోని గ్రోత్ సెంటర్ వద్ద ప్రమాదవశాత్తు లారీకింద పడి బలిజిపేట మండలం అరసాడ గ్రామానికి చెందిన వంగపండు సత్యనారాయణ(35) గురువారం దుర్మరణం చెందాడు. జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ బుధవారం రాత్రి విధులు ముగించుకుని మోటార్ సైకిల్‌పై బొబ్బిలి వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో వెనుక టైరుకింద పడగా కుడికాలి సగానికి తెగిపడింది. స్థానికులు 108 వాహనంలో స్థానిక సీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్సను అందించి మెరుగైన వైద్యం కోసం విశాఖకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సీహెచ్‌సీకి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు సత్యనారాయణ భార్య గతేడాదే అకాలమరణం చెందగా ప్రస్తుతం పదేళ్ల వయస్సున్న వారి పాప అనాథగా మిగిలింది.

వైద్యసౌకర్యం అందక మరణాలు

- ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

పార్వతీపురం టౌన్: పీటీడీ(ఆర్టీసీ) ఉద్యోగులకు ఈహెచ్ఎస్ ద్వారా వైద్యసౌకర్యాలు అందక ఏడాదికి 350 మంది చనిపోతున్నారని ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నిర్మాణసభను స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల విలీనం అనంతరం ఉత్పన్నమవుతున్న ప్రధానమైన సమస్యలలో ప్రధానంగా గతంలో ఆర్టీసీ ఉద్యోగులు ఒక్కరూపాయి కూడా చెల్లించకుండానే మెరుగైన వైద్యం రిఫరల్ ఆస్పత్రుల ద్వారా అందించేవారన్నారు. అయితే ప్రస్తుతం ఈహెచ్ఎస్ ద్వారా సరైన వైద్యసేవలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ఆదుకునే విధంగా విలీనానికి ముందున్న పాత పద్ధతుల్లోనే రిఫరల్ ఆస్పత్రుల ద్వారా వైద్యసౌకర్యాలు అందించాలని, అలాగే మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. విలీనానికి ముందు పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు కల్పించి బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

ప్రభుత్వ పరిధిలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగులకు గత ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించాల్సిన 24 నెలలు 11వ పీఆర్‌సీ ఎరియర్స్, డీఏ బకాయిలు పెండింగ్ ఉన్న నాలుగు డీఏలు చెల్లించాలన్నారు. ప్రస్తుతం ప్రవేశపెట్టబోతున్న విద్యుత్ బస్సులన్నీ ఆర్టీసీ ద్వారా నిర్వహించి ఆర్టీసీ సిబ్బందితో ఆబస్సులు నడపాలని, ప్రస్తుతం ఉన్న 10 వేల పోస్టుల ఖాళీల భర్తీకి ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్ ఇచ్చి సిబ్బంది రిక్రూట్‌మెంట్ చేయాలని కోరారు. మహిళలకు ఆగస్టు నుంచి ఫ్రీ బస్ స్కీమ్ పెట్టక ముందే 3000 కొత్తబస్సులు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఈయూ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పి.భానుమూర్తి, జిల్లా అధ్యక్షుడు మరిపి శ్రీనివాస రావు అధ్యక్షతన, జిల్లాకార్యదర్శి పైల సుందర రావు విజయనగరం జోన్ జోనల్ కార్యదర్శి బానూరి కష్టమూర్తి, విజయనగరం జిల్లా ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి గొల్లపల్లి రవికాంత్‌తో తాటు జిల్లాలో ఉన్న పాలకొండ సాలూరు, పార్వతీపురం డిపోల అధ్యక్ష, కార్యదర్శులు అధిక సంఖ్యలో ఉద్యోగులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశానికి ముందు డిపోనుంచి ఎన్జీఓ హోమ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.